రత్నగిరిపై విద్యార్థుల సమక్షంలో సరస్వతి పూజ ›7

రేపటినుంచి అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు ›8

» సామర్లకోట జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు



తెగ 'దువ్వేస్తున్నారు'!



కాకినాడ రూరల్ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే పంచిన దుస్తులు

- » ఎన్నికలు దగ్గరపడ్డంతో జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల ఆత్మీయ సమావేశాలు
- » నియోజకవర్గాల్లో గ్రామాలవారీగా క్యాడర్‌ను పిలిచి విందులు, వినోదాలు, గిఫ్ట్‌లు
- » ఎన్నికల్లో తమ విజయానికి గట్టిగా కష్టపడాలంటూ వేడుకోళ్లు
- » అటు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల తీరుపై పార్టీ నేతలు, క్యాడర్ గుర్రు
- » ఇన్నేళ్లు ఖాతరు చేయకుండా ఇప్పుడు పిలిచి దువ్వుతుండడంతో ఆగ్రహం
- » ఈ ఐదేళ్లలో తమకు ఏ పనీ జరగలేదని, ఇప్పుడెలా పనిచేస్తామంటూ అసహనం
- » వలంటీర్లకు ఇచ్చే విలువ తమకు లేనప్పుడు ఇంకెందుకులే అంటూ రుసరుసలు
- » అయినా ఓటమి భయం వెన్నాడుతుండడంతో తెగ బతిమాలుతున్న ఇన్‌ఛార్జులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డంతో జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జులు మెట్టు దిగి వస్తున్నారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొన్న నేపథ్యంలో ఓటమి భయంతో బెంబేలెత్తుతున్నారు. ఇంత కాలం తాము చెప్పిందే వేదం అన్నట్లుగా నియోజకవర్గాల్లో చెలామణీ అయిన నేతలు ఇప్పుడు క్యాడర్‌తో కలవడానికి తంటాలు పడుతున్నారు. అధికారం మత్తులో ఇంతకాలం సొంత నేతలు, క్యాడర్‌కు విలువివ్వని ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు ఇప్పుడు తమను గెలిపించాల్సింది మీరేనంటూ బతిమాలుకుంటున్నారు. వారిని మచ్చిక చేసుకునేందుకు ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. విందులు, వినోదాలు, గిఫ్ట్‌లతో దారికి తెచ్చుకునేందుకు తెగ ప్రయాసపడుతున్నారు. భారమంతా మీదేనంటూ బుగ్గ గిల్లుతున్నారు. కానీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల తీరుపై నేతలు, క్యాడర్ మాత్రం కారాలు, మిరియాలు నూరుతున్నారు. ఇన్నేళ్ల అధికారంలో ఏనాడు తమకు విలువ ఇవ్వకుండా దూరం పెట్టి ఇప్పుడు అవసరం వచ్చిందని దువ్వే ప్రయత్నాలు చేస్తున్న తీరుపై మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో కష్టపడి గెలిపిస్తే ఆ తర్వాత కనీసం విలువ ఇవ్వలేదని గుర్తుచేస్తున్నారు. చేసిన చిన్నచిన్న పనులకు సైతం బిల్లులు ఆగిపోయి కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నా ఎప్పుడూ పట్టించుకోకుండా ఇప్పుడు మళ్లీ పనిచేయండని చెబుతుండడంపై రుసురుసలాడుతున్నారు. ఈ ఐదేళ్లలో వలంటీర్లకు ఇచ్చిన విలువ కూడా తమకు ఇవ్వలేదని, వారితోనే పని చేయించుకోండంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జులు తలపట్టుకుంటున్నారు.

అవసరం మరి..

అసెంబ్లీ ఎన్నికలకు అంతకంతకు సమయం దగ్గర పడుతుండడంతో జిల్లాలో వైసీపీ ఇన్‌ఛార్జులకు ఉక్కపోత పెరుగుతోంది. ఈ ఐదేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కళ్లకు స్పష్టంగా కనిపిస్తుండడంతో ఓటమి భయం కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఓటమి ముప్పు నుంచి ఏదోలా బయటపడేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇన్నాళ్లు మేమేదంటే అది అన్నట్లుగా నియోజకవర్గాల్లో చక్రం తిప్పి, సొంత పార్టీ నేతలు, క్యాడర్‌ను చిన్నచూపు చూసిన నేతలు ఇప్పుడు వారి అవసరం వచ్చిపడడంతో దువ్వే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులోభాగంగా ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో మండలాలు, గ్రామాలవారీగా పార్టీ క్యాడర్‌ను మచ్చిక చేసుకోవడం మొదలుపెట్టారు. అందుకోసం కొత్తగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. రోజుకో రెండు లేదా మూడు పంచాయతీల్లో ముఖ్యమైన నేతలు, క్యాడర్‌ను పిలిపించి విందులు, వినోదాలు అందిస్తున్నారు. రకరకాల వంటకాలతో మెప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. రకరకాల బహుమతులు, చీరలు, షర్టులు కూడా ప్యాక్ చేసి గిఫ్ట్‌లు అందిస్తున్నారు. తాజాగా కాకినాడ రూరల్‌లో మాజీ మంత్రి కన్నబాబు ముఖ్య నేతలు, కార్యకర్తలను పిలిచి ఆత్మీయ సమావేశం పేరుతో విందు ఇచ్చారు. చీరలు, షర్టు ముక్కలు పంపిణీ చేశారు. ఇన్నేళ్లలో ఈస్థాయి గౌరవం ఎప్పుడూ ఇవ్వని కన్నబాబు ఇప్పుడు ఎన్నికల పేరుతో మచ్చిక చేసుకునే ప్రయత్నాలతో క్యాడర్ నోరెళ్లబెడుతున్నారు. మంత్రి దాడిశెట్టి రాజా కొన్నిరోజులుగా అత్యంత బలహీనంగా ఉన్న పంచాయతీల నుంచి మొదలుపెట్టి కార్యకర్తలు, ముఖ్య నేతలను పిలిచి, బూత్ కన్వీనర్లను పిలిచి ఆత్మీయ సమావేశాల పేరుతో విందులు ఇస్తున్నారు. ఎన్నికల్లో తనను గెలిపించాల్సిన బాధ్యత మీరే తీసుకోవాలని, గెలిచిన తర్వాత ఏదంటే అది చేద్దామంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. చివరాఖర్లో చేతిలో గిఫ్ట్‌లు పెట్టి సాదరంగా పంపుతున్నారు. ఎంపీ అభ్యర్థిగా సునీల్ నియోజకవర్గాలవారీగా పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు జరుపుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానాల్లో కొత్తగా వచ్చిన పిఠాపురం ఇన్‌ఛార్జి గీత, జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం, ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి వరుపుల తరచూ ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఎప్పుడూ క్యాడర్‌ను పట్టించుకోలేదని, తాము బాగా చూసుకుంటామంటూ బతిమాలుతున్నారు. విందులు ఏర్పాటు చేసి మచ్చిక చేసుకుంటున్నారు. గెలిపిస్తే ప్రాధాన్యం ఇస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి, పెద్దాపురం ఇన్‌ఛార్జి దవులూరి క్యాడర్‌ను దువ్వుతున్నారు. ఏ పనైనా ఉంటే చెప్పండి.. చేసేద్దాం అంటూ క్యాడర్‌కు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పుడు గుర్తొచ్చామా..

ఓటమి భయంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జులు తాజాగా తమను మచ్చిక చేసుకునే ప్రయత్నాలపై పార్టీ ముఖ్యనేతలు, సీనియర్లు, ఇతర క్యాడర్ మండిపడుతున్నారు. పార్టీ గెలిచిన తర్వాత ఇన్నేళ్లలో తమకు కనీసం విలువ ఇవ్వలేదని, ఇప్పుడు అవసరం రావడంతో దువ్వడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పథకాల్లో తమ పేర్లు లేవని, చిన్నచిన్న కాంట్రాక్టులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, ఇళ్ల స్థలాలు ఏవి అడిగినా చూద్దాం అంటూ దాట వేసి తమకు నచ్చిన వారికి ఇచ్చుకున్నారని ఇప్పుడు మా అవసరం వచ్చిందా అంటూ వారంతా గుర్రుగా ఉన్నారు. ఇదే విషయాన్ని ఆత్మీయ సమావేశాల్లో కొందరు నిలదీస్తున్నారు. గ్రామాల్లో నాడు-నేడు, ఆర్‌బీకేల నిర్మాణ కాంట్రాక్టులు చేస్తే కనీసం బిల్లులు ఇప్పించలేక పోయారని గుర్తు చేసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి, గ్రావెల్ తవ్వకాలను ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులే సాగించి లాభపడ్డారని, కనీసం తమను పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఇంతకాలం వలంటీర్లపైనే ఆధారపడి క్యాడర్‌ను వదిలేశారని, వారికి ఇచ్చిన విలువ కూడా ఇవ్వనప్పుడు ఎలా పనిచేస్తామంటూ క్యాడర్ నిలదీస్తున్నారు. ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు అన్నీ వాళ్లే సర్దుకున్నారని, తమను కనీసం పట్టించుకోలేదని అక్కడ క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడొచ్చిన కొత్త ఇన్‌ఛార్జులు ఈసారి అలా జరగదని, మీకే ప్రాధాన్యం అంటూ బతిమాలే ప్రయత్నం చేస్తున్నా అప్పుడు కూడా మొదట్లో అలాగే అన్నారంటూ రుసరుసలాడుతున్నారు.



సిలబస్ పేరుతో.. చుక్కలు

- » టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ముప్పుతిప్పలు
- » గతంలో లేని విధంగా అధికారుల నిర్ణయం
- » ఆందోళనలో ఆశావహులు

పెద్దాపురం, ఫిబ్రవరి 22: టెట్, డీఎస్సీ ఆశావహ అభ్యర్థులను సిలబస్ ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సిలబస్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ కోసం పోరాటం చేసిన నిరుద్యోగులపై కక్షసాధింపులో భాగంగానే సిలబస్ అధికంగా ఉండేలా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా టెట్, డీఎస్సీ అర్హత పరీక్షలో కంటెంట్, మెథడాలజీ సిలబస్‌గా ఉంటాయి. టెట్ రాసే అభ్యర్థులు మూడు నుంచి పది(డీఎడ్ అభ్యర్థులు) ఆరునుంచి ఇంటర్ వరకూ(బీఈడీ అభ్యర్థులు) సిలబస్‌ను రిఫర్ చేస్తారు. ఇవి ఎప్పుడు నిర్వహించినా ఇంతకుముందు అకడమిక్ ఇయర్‌లో అమలు చేసిన సిలబస్ ఇవ్వాలి. దీనిప్రకారం తాజాగా నిర్వహించనున్న టెట్, డీఎస్సీలో 2022-2023 విద్యాసంవత్సరంలో అమలు చేసిన సిలబస్ ఇవ్వాలి. కానీ ఇక్కడే విద్యాశాఖ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో సంస్కరణల పేరుతో 2019 నుంచి 2023 వరకూ ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకూ సిలబస్‌ను మార్చింది. 2018లో అప్పటి ప్రభుత్వం కొన్ని తరగతుల సిలబస్ మార్చింది. ఇప్పటివరకూ మార్చిన మొత్తం సిలబస్‌లోనే టెట్, డీఎస్సీలో ప్రశ్నలు ఇవ్వనున్నారు. తొమ్మిదో తరగతి సిలబస్‌ను రిఫర్ చేయడానికే కనీసం రెండు నెలలు పడుతుంది. అలాంటిది ఇన్నేళ్లపాటు మార్చిన సిలబస్‌ను నెలరోజులల్లో పూర్తి చేయడం అసాధ్యమని అభ్యర్థులు వాపోతున్నారు.

14 మెథడ్స్ చదవాల్సిందే..

ఎస్జీటీ అభ్యర్థులకు 2018 వరకూ ఐదు మెథడ్స్ ఉండేవి. ఆ తరువాత ప్రభుత్వం దీన్ని తొమ్మిదిగా మార్పుచేసింది. తాజాగా టెట్, డీఎస్సీలో వీటితోపాటు పాత ఐదు మెథడ్స్‌ను సిలబస్‌లో ఇస్తున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. ఒక్కో మెథడాలజీ పుస్తకం 300 పేజీలుంటుంది. తొమ్మిది మెథడాలజీలు తిరగేసేందుకు రెండు నెలలు పడుతుందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. వీటితోపాటు డీఎస్సీ పరస్పెక్టివ్ ఎడ్యుకేషన్ ఉంటుంది. ఇందులోనుంచి 20 వరకూ బిట్స్ ఇస్తారు. పరస్పెక్టివ్ ఎడ్యుకేషన్‌తోపాటు మిగిలిన సబ్జెక్టులను రిఫర్ చేసేలా తాజాగా డీఎస్సీలో సిలబస్ పెట్టారని ఇది మరింత ఇబ్బందికరమైన అంశముంటుందన్నారు. దీనివల్ల మెథడాలజీతోపాటు మిగిలిన సబ్జెక్టులను చదవాలంటున్నారు.

ఏది సమయం..?

టెట్ నోటిఫికేషన్‌కు, పరీక్షకు కనీసం మూడునెలలు, టెట్‌కు, డీఎస్సీకి మధ్య రెండు నెలలు సమయం ఇస్తుంటారు. కానీ తాజాగా టెట్, డీఎస్సీ పరీక్షలకు మధ్య ఉన్న సమయం వారంకంటే తక్కువ ఉంది. టెట్ క్వాలిఫై అయినవారు మాత్రమే డీఎస్సీకి దరఖాస్తు చేస్తారు. కానీ హడావుడి నోటిఫికేషన్‌తో కనీసం పుస్తకాలు తిరగేసేందుకు అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఈనెల 27 నుంచి మార్చి తొమ్మిది వరకూ టెట్ జరగనుంది. మార్చి 14న ఫలితాలు ప్రకటిస్తారు. మార్చి 17 నుంచి 30 వరకూ డీఎస్సీ నిర్వహిస్తారు. టెట్‌కు గతంలో రూ.250 నుంచి రూ.500 వరకూ ఫీజు ఉండగా తాజాగా దాన్ని రూ.750కు పెంచారు. డీఎస్సీ ఫీజు గతంలో రూ.వెయ్యి ఉండగా ఇపుడు రూ.1200 చేశారు.



గొల్లప్రోలు మండలం మల్లవరం ఆర్‌ఆర్‌బీ చెరువుకు ఉన్న రివిట్‌మెంట్‌ను తవ్వేసిన దృశ్యం

కాలువ కోసమని.. రివిట్‌మెంట్ తవ్వేశారు

» మల్లవరం రైతుల ఆగ్రహం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 22: పంట పొలాలకు సాగునీరు అందించేందుకు వీలుగా కాలువల్లో పూడిక తొలగించేందుకు వచ్చి ఎక్స్‌కవేటర్‌తో చెరువుకు ఉన్న రివిట్‌మెంట్‌ను తొలగించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల గట్లు బలహీనపడి గండ్లు పడితే రెండు గ్రామాలు ముంపునకు గురవుతాయని వారు తెలిపారు. గొల్లప్రోలు మండలం మల్లవరంలోని ఆర్‌ఆర్‌బీ చెరువు ద్వారా గొల్లప్రోలు, తొండంగి మండలాల్లోని 20వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తొండంగి మండలంలోని కోదాడ తదితర గ్రామాల రైతులకు సాగునీరు అందడం లేదంటూ అందిన ఫిర్యాదులతో ఈ చెరువుకుగల 7, 8 తూముల నుంచి వచ్చే కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులను గురువారం అధికారులు చేపట్టారు. పూడిక తొలగించకుండా ఈ రెండు తూముల మధ్య చెరువు గట్టుకు గల రాజుల కాలం నాటి రివిట్‌మెంట్‌ను ఎక్స్‌కవేటర్‌తో తవ్వేశారు. దీనిపై ఏకే, ఏపీ మల్లవరం గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రివిట్‌మెంట్ తొలగింపుతో గట్లు పూర్తిగా బలహీనమయ్యాయని, ఏమాత్రం అధిక నీరు ఉన్నా, వరదలు వచ్చినా గట్లు తెగిపోయి మల్లవరం గ్రామంతోపాటు 1500 ఎకరాలు ముంపునకు గురవుతాయని ఎంపీటీసీ పెనుమల్లు సుబ్రహ్మణ్యం, కడిమిశెట్టి భాస్కరరెడ్డి, పద్మనాభరెడ్డి, పెనుమల్లు అయ్యప్పరెడ్డి, శ్రీరంగారెడ్డి, చింతపల్లి సన్యాసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలా జరిగిందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తూములు, షట్టర్లకు మరమ్మతులు చేయమని ఏళ్లుగా అడుగుతున్నా స్పందించని అధికారులు ఇప్పుడు ఏకంగా రివిట్‌మెంట్‌ను తొలగించడంపై వారు మండిపడుతున్నారు.

ఐటీ ఇంక్యుబేషన్ టవర్ అలంకారప్రాయమేనా?



కాకినాడ రూరల్‌లోని ఆటోనగర్‌లో నిరుపయోగంగా మారిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్

- » రూ.7.5కోట్లు వెచ్చించినా నిరుద్యోగులకు దక్కని ఉపాధి
- » తరలింపు యోచనలో ప్రైవేట్ ఐటీ కంపెనీ
- » చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- » స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఎక్కడని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు

సర్పవరం జంక్షన్(కాకినాడ రూరల్), ఫిబ్రవరి 22: నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం ఏర్పాటు చేసిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్ నిరుపయోగంగా ఉంది. సర్పవరం ఐటీ సెజ్‌లో రూ.7.50కోట్ల నిధులతో సువిశాల భవనంలో అన్ని సౌకర్యాలతో కార్పొరేట్ ఐటీ కంపెనీలకు దీటుగా నిర్మించిన ఈ ఐటీ ఇంక్యుబేషన్ టవర్ అలంకారప్రాయంగా మారింది. వందలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పించిన ప్రైవేట్ ఐటీ కంపెనీ సెయింట్ ప్రభుత్వ ప్రోత్సాహకం లేక విశాఖ తరలిపోతోంది. ఇక్కడ ఒకటి ప్రభుత్వం, మరొకటి ప్రైవేట్ ఐటీ కంపెనీ ఉందన్న సంగతి జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు కూడా తెలిసిన దాఖలాల్లేవని ఇంజనీరింగ్ పట్టభద్రతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహంలేక, నిర్వహణ లేకపోవడంతో టవర్ శిథిలావస్థకు చేరింది. దీనికి కూతవేటు దూరంలో 2013లో ఏర్పాటు చేసిన సైయంట్ (సీవైఐఈఎన్‌టీ) ఐటీ కంపెనీ కూడా విశాఖకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐటీ కంపెనీలతో మాట్లాడి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

అక్కరకు రాని ఐటీ టవర్

కాకినాడ రూరల్ సర్పవరం ఆటోనగర్ ఐటీ సెజ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌ని టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015, డిసెంబరు 30న అప్పటి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ సమాచారశాఖ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఇంజనీరింగ్‌లో పట్టభద్రులైన నిరుద్యోగుల విభిన్న ప్రయోగాత్మక ఆలోచనాశక్తి, సృజనాత్మకతను వెలికితీసి సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ను పెంచేందుకు వీలుగా 50సెంట్ల స్థలంలో ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ 2వేలమంది ఉద్యోగులు పనిచేసేందుకు అవసరమైన బ్లాకులు నిర్మించారు. ఈ టవర్‌లో ఉద్యోగాల కల్పనకు మూడు ఐటీ కంపెనీలతో ఒప్పందం జరిగినా ఒక్కటి కూడా ఇక్కడ అడుగుపెట్టలేదు. ఐటీ టవర్ ప్రారంభంతో వందలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆశించామని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీ ఇంక్యుబేటర్, టవర్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ ఐటీ కంపెనీకి చెందిన క్లయింట్(సీవైఐఈఎన్‌టీ) వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని వారు చెప్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సాహం కరువు

విశాఖలో ప్రారంభించిన ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌లో వేలాదిమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంటే ఇక్కడ సర్పవరంలో ఉన్న ఇంక్యుబేటర్ టవర్‌ని ప్రారంభించి 8ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరికీ ఉద్యోగావకాశాలు కల్పించలేదు. చిన్నచిన్న కంపెనీలు వచ్చినా వాటికి ప్రభుత్వంనుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఎందుకూ పనికిరాని విధంగా తయారైంది. ఇంక్యుబేషన్ టవర్‌లోకి స్టార్టప్, ఐటీ కంపెనీలు వచ్చేలా ప్రభుత్వం తరఫునుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఇంక్యుబేషన్ టవర్ ఎందుకూ పనికిరాకుండా పోయిందని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. టవర్ గ్రౌండ్ ఫ్లోర్ అప్పుడే చెద పట్టేసి శిథిలావస్థకు చేరే దశకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో భవనం పాడైపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరలిపోనున్న ప్రైవేట్ సెయింట్ ఐటీ కంపెనీ

ఇంక్యుబేషన్ టవర్‌కు కూతవేటు దూరంలో 2013లో సెయంట్ (సీవైఐఈఎన్‌టీ) ఐటీ కంపెనీ ఏర్పాటు చేశారు. కొవిడ్ ముందు వరకు పగలు, రాత్రి తదితర రౌండ్ ది క్లాక్ మూడు షిఫ్ట్‌ల్లో 1050మంది వరకు ఐటీ ఉద్యోగులు పనిచేసేవారు. కొవిడ్ తర్వాత ఐటీ రంగంలో ఏర్పడిన సంక్షోభంతో ఉద్యోగుల తొలగింపు ప్రభావం ఈ కంపెనీపై పడింది. ఉద్యోగ సంస్కరణల్లో భాగంగా కొద్దిమంది సిబ్బందిని యాజమాన్యం తగ్గించడం, నిధుల ఆదాలో భాగంగా ప్రస్తుతం ఇక్కడ 500మంది వరకు పనిచేస్తున్నారు. కొంతమంది సిబ్బందికి వర్క్ ఫ్రం హోంతో ప్రస్తుతం సగం మంది ఇక్కడ పనిచేస్తున్నారు. ఇదే క్రమంలో ఈ కంపెనీలో వెళ్లే ప్రధాన రహదారిలో సరైన రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనలో వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆ ప్రభావం సెయింట్ ఐటీ కంపెనీపై పడింది. ఇక్కడ పరిస్థితులు ఇలాగే ఉంటే దీన్ని అనేక వ్యయప్రయాసలకోర్చి నిర్వహించలేమని నిర్ధారణకు ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం రావడంతో ఇప్పటినుంచి సంస్థ కార్యకలాపాలు విశాఖనుంచి జరిగేలా చర్యలు ప్రారంభించినట్లు సిబ్బంది తెలిపారు. కొత్త కంపెనీలు ఎలాగో తీసుకురాలేరని, ఉన్న కంపెనీలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

ఇసుక దందా నివేదికపై.. జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ డిమాండ్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 22: జగన్‌రెడ్డి ఇసుక దందా ఇంతవరకు అధికారుల కళ్లకు కనిపించలేదా.. ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని కేంద్ర పర్యావరణశాఖ ఇచ్చిన నివేదికపై సీఎం జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ(ఎంవోఈఎఫ్) స్పష్టం చేసిందన్నారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు(సీపీసీబీ), ఎంవోఈఎఫ్ అధికారులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారన్నారు. భారీ యంత్రాలతో ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్లు తేల్చారని చెప్పారు. అక్రమ తవ్వకాల ఫొటోలు, నకిలీ బిల్లు పుస్తకాలు వంటి ఆధారాలను కమిటీ సేకరించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతల కనుసన్నల్లో 500కిపైగా ఇసుక రీచ్‌ల్లో అక్రమంగా ఈసీలు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ఇసుక తవ్వకాల్లో పెద్దఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయని, రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ(సీయా) గతేడాది ఏప్రిల్‌నుంచి ఇప్పటివరకు ఇసుక తవ్వకాలకు కొత్తగా పర్యావరణ అనుమతులు జారీచేయలేదన్నారు. అయినా సరే భారీ యంత్రాలతో 24 గంటలు ఇసుకను తవ్వేస్తూ ఒక్కో రీచ్‌లో వెయ్యినుంచి 2వేల టన్నుల ఇసుక తరలించి కోట్లు ఆర్జిస్తున్నారన్నారు. దీనిపై జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలని నవీన్ డిమాండ్ చేశారు.

పకడ్బంధీగా టెన్త్ పరీక్షల నిర్వహణ: డీఈవో

పిఠాపురం, ఫిబ్రవరి 22: పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షల నిర్వహణపై గురువారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో డీఈవో మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలకు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడా లోటుపాట్లు జరగకుండా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణ, విధివిధానాల గురించి అవగాహన కల్పించారు. పెద్దాపురం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఆర్‌జే డేనియల్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, పెద్దాపురం డివిజన్ పరిధిలోని ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది: ఆర్‌జేడీ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 22: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, 18 ఏళ్లు నిండిన యువత భవిష్యత్తు ఓటర్లుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరచాలని, మహిళలు మంచినాయకులను ఎన్నుకోవాలని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి అన్నారు. కాకినాడ పీఎస్‌ఎల్ మహిళా డిగ్రీ కళాశాలల్లో మహిళా ఫ్యూచర్ ఓటర్లపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్జేడీ నాగమణి మాట్లాడుతూ 80ఏళ్లు నిండిన వృద్ధులు, 40శాతం అంగవైకల్యం దాటి ఉన్న దివ్యాంగులు ఎట్ హోం ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. జీసీడీవో ఉమామహేశ్వరి, డీఐ వాణీకుమారి, స్వీప్ సమన్వయకర్తలు శివప్రసాద్, సుబ్రహ్మణ్యం, ఎంఈవో-2 సీహెచ్ రవి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉద్యోగిపై విచారణకు ఆదేశం

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 22: కాకినాడ జీజీహెచ్‌లో గ్రేడ్-2 మెకానిక్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేంద్రరాజు అనే వ్యక్తి అవినీతికి పాల్పడినట్లు కలెక్టర్, విజలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందింది. గతంలో జీజీహెచ్‌లో ఎంఎన్‌వోగా పనిచేసి అనారోగ్య రీత్యా నిర్బంధ పదవీ విరమణ చేసిన వ్యక్తికి కొడుకైన సురేంద్రరాజు నియామకం వివాదంలో పడింది. తండ్రి పూర్తి ఆరోగ్యవంతుడిగా ఉండి అవినీతిమార్గంలో మెడికల్ ఇన్‌వాల్యుడేషన్‌లో అవకతవకలకు పాల్పడి కుమారుడిని ఉద్యోగంలో చేర్పారన్న ఆరోపణలపై ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు కలెక్టర్, విజిలెన్స్ విభాగాలకు అందడడంతో కలెక్టర్ తక్షణమే విచారణకు ఆదేశించి మెడికల్ ఇన్‌వాల్యుడేషన్‌పై తగిన సమాచారం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జీజీహెచ్ వర్క్‌షాప్‌లో గ్రేడ్-2 మెకానిక్‌గా పనిచేస్తున్న సురేంద్రరాజు పరికరాల నిర్వహణ, ఇతర అంశాల్లో అవినీతికి పాల్పడ్డాడని ఫిర్యాదులో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై జీజీహెచ్ అధికారులు విచారణ జరిపి అందుకు సంబంధించిన నివేదికను త్వరలోనే కలెక్టర్‌కు సమర్పించనున్నారు.



పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని పురాతన కల్యాణ మండపం వద్ద గురువారం సాయంత్రం ఐదు గంటలకు నూతన వధూ వరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు గావించి పండిత సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకస్వాముల సారథ్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లకు వేదాశీర్వచనం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి తన్మయత్వం పొందారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, పేరూరు వేద పండితులు పాల్గొన్నారు.



హనుమద్వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

వైభవంగా గ్రామోత్సవం

హనుమద్వాహనంపై ఊరేగిన స్వామి, అమ్మవారు

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన గురువారం సాయంత్రం అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి వెంకట సత్యనారాయణరాజుచే నిర్మితమైన హనుమ ద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. తొలుత స్వామివారి వాహనశాల వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వాహన నిర్మాతలు, అధికారులు, అర్చ కులు, భక్తులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకస్వాముల ప్రత్యేక పూజల అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు వాహన సేవను చూసి తరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, ఎస్ఐ ఎ స్.రాము, దాసరి వాసు, భక్తులు పాల్గొన్నారు.

వసంత మండపం ప్రారంభం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని చక్రస్నానం అనంతరం స్వామివారి తలార్చుకోవడానికి నూతన వసంత మండపాన్ని ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ ప్రారంభించారు. అంతకు ముందు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. శని వారం జరగబోయే చక్రస్నానానికి ఈ వసంత మండపం వద్ద స్వామివారు ఆశీనులు కానున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిర ణ్ తెలిపారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి ఎస్ఐ ఎ స్.రాము, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు ఒ డుగు శ్రీను, కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నా గరాజు, వాహనదారులు, భక్తులు పాల్గొన్నారు.

చక్రస్నానానికి ఏర్పాట్లు

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సముద్ర స్నానాల ఘట్టం వద్ద స్వామివారి చక్రస్నానానికి ఏర్పాట్లు చేస్తున్న ట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. మాఘ మాసం శనివారం అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నా నాలకు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో బారికేడ్లు పెట్టి పూజలను భక్తులంతా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

భీమేశ్వరునికి సదస్యం



పండిత సత్కారం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సదస్యం ఘనంగా జరిగింది. కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామిలను వేదికపై అధిష్ఠింపజేశారు. తొలుత అర్చకస్వాములు స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూశారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహన, ముక్కోటి దేవతా ఆవాహన చేశారు. అనంతరం వేదస్వస్తి, స్వస్తి ప్రవచనం జరిపారు. ఆగమ పండితులు, వేద పండితులు, స్వస్తివాచకులు, అర్చకస్వాములు, పురోహితులను నూతన వస్త్రాలతో ఈవో పీటీవీ సత్యనారాయణ సత్కరించారు. నీరాజన మంత్రపుష్పాలతో సదస్యం పూర్తయ్యింది. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అనంతరం సమస్త వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది.

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.91.05 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, ఫిబ్రవరి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, ఎం.రాధాకృష్ణ, బి.కిరణ్, నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 29 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.69,95,492, అన్నప్రసాద హుండీల ద్వారా రూ21,09,881.. మొత్తం రూ.91,05,373 ఆదాయం లభించింది. బంగారం 57 గ్రాములు, వెండి 900 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్ తెలిపారు. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.1,55,674 లభించింది. లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు మన్యం సూర్యకుమారి భాను, శనగన సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమక్షంలో సరస్వతి పూజ

● రత్నగిరిపై ఘనంగా ఏర్పాట్లు ● పెన్నులు అందించిన ఈవో



సరస్వతి పూజ నిర్వహిస్తున్న పండితులు



పూజకు హాజరైన విద్యార్థులు

అన్నవరం, ఫిబ్రవరి 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం ఉచిత సామూహిక సరస్వతి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను, సరస్వతి దేవిని పండితులు ఆశీనులు గావించగా ఈవో రామచంద్రమోహన్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే అర్చక స్వాములు సత్యదేవుడు, సరస్వతీదేవిల అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీదేవి చెంత ఉంచిన కలములు, రక్షలను విద్యార్థులకు పండితులు మంత్రపూర్వకంగా అందించారు. పదో తరగతి, ఇంటర్ తదితర పరీక్షలు, పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి ప్రతీఏటా దేవస్థానం తరుపున సామూహిక సరస్వతి పూజను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమం అనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు స్వామివారి ప్రత్యేక దర్శనం, ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు.

నూతన రథంపై ప్రాకార సేవ



అన్నవరం, ఫిబ్రవరి 22: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి గురువారం నూతన రథంపై ప్రాకార సేవ నిర్వహించారు. పర్వ దినాలలో స్వామివారికి వెండిరథంపై ఊరేగింపు నిర్వహించేవారు. ఆ రథం పాతదై పోవడంతో ముందు జాగ్రత్త చర్యగా పూర్వపు ఈవో ఆజాద్ రూ.38 లక్షల వ్యయంతో టేకు రథం చేయించాలని ప్రతిపాదించి పనులు ప్రారంభించారు. రథం తయారీ పూర్తికావడంతో గురువారం ఈవో రామచంద్రమోహన్ దంపతులు రథాన్ని ప్రారంభించారు. అనంతరం రథంపై స్వామి,అమ్మవార్లు ఆలయ ప్రాకారం చుట్టూ విహరించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, ఇంద్రగంటి సుధీర్, పాలంకి పట్టాభి ముత్య వెంకట్రావు, పాలక మండలి సభ్యులు పేరూరి బద్రీనారాయణ పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

సిద్ధి వినాయక ఆలయ హుండీల ఆదాయం రూ.27.20 లక్షలు

అయినవిల్లి, ఫిబ్రవరి 22: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామి ఆలయ హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. 56 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.26,22,100, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.98,061... మొత్తం రూ.27.20 లక్షలు వచ్చిందని ఈవో ముదునూరి సత్యనారాయణరాజు చెప్పారు. 3.3 గ్రాముల బంగారం, 527 గ్రాముల వెండితో పాటు 21 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. పర్యవేక్షణాధికారిగా అమలాపురం తనిఖీదారు జంపా రామలింగేశ్వర రావు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తలు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముక్తేశ్వరం బ్రాంచి సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పెల్లలో వివాహిత హత్య

వివాహేతర సంబంధమే కారణమని అనుమానాలు



కుమారి(ఫైల్)



ఆలమూరు, ఫిబ్రవరి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లలో వివాహిత సలాది మరియకుమారి (30) హత్యకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...చొప్పెల్ల గ్రామంలో నివాసముంటున్న సలాది మరియకుమారి, బిక్కవోలు మండలం మెళ్లూరుకు చెందిన అవివాహితుడైన చల్లా దుర్గానాగప్రసన్నకుమార్ మధ్య రెండేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. మరియకుమారికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రసన్నకుమార్ తన అక్క, బావలకు చెందిన ఇటుక బట్టీ నిర్వహిస్తున్నారు. అందులో కుమారి భర్త సలాది శివసూర్యనారాయణ కూలీగా పనిచేస్తున్నాడు. దీంతో వారిద్దరి మధ్య సంబంధం కొనసాగుతోందని భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల మరియ కుమారి మరొకరితో చనువుగా ఉంటోంది. ఈ విషయమై కొద్ది రోజులుగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ప్రసన్నకుమార్ మరియకుమారిని బలంగా కొట్టి చంపేసినట్టు భావిస్తున్నారు. కొద్దిసేపటి తర్వాత మరియ కుమారి ఉరేసుకుని చనిపోయిందంటూ ప్రసన్నకుమార్ కొందరిని తీసుకెళ్లి చూపించినట్టు చెప్తున్నారు. కోపంతో బలంగా కొట్టడంతో కిందపడి చనిపోయిందని ప్రసన్నకుమార్ తమ విచారణలో చెప్పా డని రూరల్ సీఐ రామ్ కుమార్ తెలిపారు. నిందితుడు ఆలమూరు తహసీల్దారు గోపాలకృష్ణ ఎదుట లొంగి పోయాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ చెప్పారు.

జనసేన పార్టీకే నా సపోర్టు

కుటుంబీకులు ఆదేశిస్తే బాబాయి తరపున ప్రచారం

ఆపరేషన్ వాలంటైన్ సినిమా ప్రమోషన్‌లో సినీ హీరో వరుణ్‌తేజ్



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 : 'బాబాయి పవన్ కల్యాణ్ జనసేన పార్టీ ద్వారా నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నారు. ఆయన చేస్తున్న పోరాటంపై మాకు నమ్మకం ఉంది. నా సపోర్టు జనసేన పార్టీకే ఉంటుంది' అని సినీ హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన ఆపరేషన్ వాలంటైన్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విచ్చేసి మీడియాతో మాట్లాడారు. రాజకీయాలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ తన కుటుంబ సభ్యులు అనుమతిస్తే వచ్చే ఎన్నికల్లో బాబాయి పవన్ కల్యాణ్ తరపున జనసేన పార్టీ కోసం ఎన్నికల్లో ప్రచారం చేస్తానని వెల్లడించారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆయన ఎంచుకునే మార్గాలపై నమ్మకం ఉందని స్పష్టం చేశారు. బాబాయితో కలసి నటించడం ఇష్టమే అయినా ప్రస్తుతం అలాంటి కథలేవీ లేవన్నారు. పుల్వామా ఘటనల నేపథ్యంలో దర్శకుడు సినిమాను తెరకెక్కించారని, మార్చి 1 సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు.

వంజరాల వేటతో సందడి



ఉప్పాడ(కొత్తపల్లి) ఫిబ్రవరి 22: ఉప్పాడ తీరంలో వంజరం చేపల వేటతో సందడి నెలకొంది. గురువారం ఉప్పాడ తీరం నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారులకు విరివిగా వంజరాలు దొరికాయి. గత రెండు రోజులు నుంచి తీరంలో మత్స్య సంపద దొరకడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తీరంలో వంజరాల వేటతో సుమారు రూ.20 లక్షల ఆదాయం వచ్చినట్టు సమాచారం.

రేపటి నుంచి అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

సామర్లకోట జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు



క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 22: సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 24 నుంచి 26 వరకూ మూడు రోజుల పాటు 56వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్స్ ఖో-ఖో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఖోఖో సంఘం కార్యదర్శి, పోటీల నిర్వాహణ కార్యదర్శి కె. పట్టాభిరామం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాన్ మోజెస్‌తో కలిసి గురువారం సాయంత్రం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టాభిరామం మాట్లాడుతూ మూడు రోజుల పాటు సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో డే అండ్ నైట్ ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. రాష్ట్రంలో 13 జిల్లాల క్రీడాకారులతో పాటు ఏపీ ఉద్యోగ సంఘం కూడా పోటీలలో పాల్గొంటోందన్నారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర పురుషుల, మహిళల జట్లకు ఎంపిక చేసి ఆంధ్ర రాష్ట్రం తరపున మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకూ న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నామని జాన్‌మోజెస్ తెలిపారు. పాలిక చంటి, కెన్నడీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సాక్షిగా వైసీపీ నాయకుల ఘర్షణ

కడియం, ఫిబ్రవరి 22: సాక్షాత్తు మంత్రి సమక్షంలో వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగారు. కడియం ఉన్నత పాఠశాలలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. మంత్రి వేణుగోపాలకృష్ణ వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. అయితే ఫొటోలు తీసే సమయంలో ముందుండాలనే విషయంపై మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ ఈలి గోపాలం, వైసీపీ జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తిలకు మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో ఘర్షణకు దిగారు. ఈ సంఘటనతో మంత్రి వేణు కొంత అసహనానికి గురయ్యారు. ఇద్దరినీ విడదీసే ప్రయత్నం చేసినా వారు లెక్కచేయక పోవడంతో అక్కడే ఉన్న పోలీసులు గొడవ పెరగడకుండా చూశారు. కాగా కొంతకాలం నుంచి చక్రవర్తి, గోపాలం మధ్య విభేదాలున్నాయి.

25న ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22: అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో 2వ వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబు దంపతుల నేతృత్వంలో పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్-2024 పోటీలను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు జిమ్ కోచ్ కంకిపాటి.వెంకటేశ్వరరావు తెలిపారు. అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో ట్రోఫీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, ప్రధాన కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు గురువారం ఆవిష్కరించారు. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో జరిగే పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఇప్పటికే వంద మందికిపైగా క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, సభ్యులు దొమ్మేటి వెంకటరమణ, మట్టపర్తి వెంకటసముద్రం, చిక్కం రాజబాబు, పొణకల దుర్గాప్రసాద్, నార్ని శ్రీను, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, సంసాని సోమశేఖర్, కరాటం రవిసుధీర్ పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల వద్ద మోటార్ల చోరీ

అల్లవరం, ఫిబ్రవరి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని డి.రావులపాలెం, తాడికోన, కొమరగిరిపట్నం గ్రామాల్లో ఆక్వా చెరువుల వద్ద మోటార్ల ఇంజన్లు దొంగలపాలయ్యాయి. డి.రావులపాలెంలో మోటార్ ఇంజన్‌ను అపహరిస్తున్న దొంగను రైతు బొబ్బిలి శ్రీను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు సమాచారం. డి.రావులపాలెంలో తన చెరువు వద్ద మోటారు ఇంజన్ చోరీకి గురైందని తిక్కా శ్రీరామమూర్తి అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గడిచిన ఏడాది కాలంలో అల్లవరం మండలంలో సుమారు 70కిపైగా మోటార్ ఇంజన్లు దొంగతనాలకు గురయ్యాయి. దొంగతనాలకు పాల్పడుతున్న వారిని, వాటిని కొనుగోలు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు.

అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి నిరసన

కలెక్టరేట్‌లో బైఠాయింపు



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో అధికారుల తీరును నిరసిస్తూ అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలతను కలిసి అనపర్తి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే కలెక్టర్, జేసీ, డీఆర్వో అందుబాటులో లేకపోయినా చాంబర్ చాంబర్‌కు తిప్పడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అనేక చోట్ల అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేయడానికి జిల్లా కలెక్టరేట్‌కు మధ్యాహ్నం వచ్చామన్నారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ ఆఫీస్‌లో ఉన్నారని చెప్పడంతో జాయింట్ కలెక్టర్ కోసం చూశామన్నారు. అయితే ఆయన ట్రైనింగ్‌లో ఉన్నారని చెప్పారన్నారు దీంతో డీఆర్వో కోసం చూస్తే అక్కడ ఆయన కార్యాలయానికి తాళం వేసి ఉందన్నారు. ఇలా 45 నిమిషాల పాటు అన్ని చాంబర్లు తిరిగినా ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. దీంతో అధికారుల తీరుకు బైఠాయించి నిరసన తెలిపామన్నారు. అప్పుడు ఒక అధికారి వచ్చి వినతి తీసుకున్నారన్నారు. బదిలీ అయ్యివెళ్లిన పోసిబాబు అనే తహశీల్దార్ తిరిగి అనపర్తి వచ్చి డమ్మీ పట్టాలపై సంతకం చేయడం, అలాగే జరగని భూసేకరణ జరిగినట్లు చెబుతూ గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది రెవెన్యూ అధికారులు కలిసి డమ్మీ పట్టాలు పంపిణీ చేయడంపై ఫిర్యాదు చేయడానికి వస్తే ఇక్కడ పట్టించుకునే వారే లేరన్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ

యర్రవరంలో బీజేపీ ప్రజా పోరుయాత్ర

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22: ప్రత్తిపాడు నియోజకవర్గంలో బీజేపీ ప్రజాపోరు యాత్రలో గురువారం ఏలేశ్వరం మండలం యర్రవరం నుంచి ప్రారంభించింది. యర్రవరంలో ప్రజాపోరు యాత్రనియోజకవర్గ కన్వీనర్ గట్టిం వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, రెడ్డి లోవరాజు, కూరాకుల రాజా, బండారు శ్రీనుబాబు, మదిరెడ్డి పాపరాజు, పి.శ్రీను, వై.గంగారావు, పి.దుర్గ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని
సద్వినియోగం చేసుకోవాలి

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 22: అర్హులైన లబ్ధిదారులంతా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ నాగనరసింహారావు సూచించారు. జేఎన్టీయూకేలోని అలూమ్నీ ఆడిటోరియంలో విశాఖపట్నంలోని ఎంఎస్ఎంఈ మినిస్ట్రీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నాగనరసింహారావు, డీపీవో కేబీ సౌజన్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం టి.మురళీ, లీడ్ డీఎమ్ ప్రసాద్, ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో జె.చంద్రమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగనరసింహారావు మాట్లాడుతూ ఈ పథకం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కార్పెంటర్లు, టైలర్లు, కమ్యూనిటీ నాయకులు పాల్గొనగా 60మంది దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్లకోసం స్టాల్స్‌ను సందర్శించారు.

షర్మిలను నిర్బంధించడం అమానుషం

● ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ ధ్వజం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 22: డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ విజయవాడ ఆంధ్రరత్న భవన్ నుంచి సెక్రటేరియట్‌కు బయలుదేరిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని పార్టీ ఆఫీసువద్దే పోలీసులు నిర్బంధించడం అమానుషమని ఏపీసీసీ ప్రధానకార్యదర్శి ఆకుల వెంకటరమణ ధ్వజమెత్తారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 2లక్షల30వేల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి కేవలం 2,500 పోస్టులు తీయడం దారుణమన్నారు. సమావేశంలో ఏపీసీసీ సభ్యు డు కుక్కల పోతురాజు, నాయకులు పిట్టా అర్జున్, జుత్తుక సత్తిబాబు, పి.రమేష్, బి.ఐశ్వర్య పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 22: కాకినాడరూరల్ వలసపాకల గంగరాజునగర్ రోడ్డునెం.1లో గురువారం కాకినాడరూరల్ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు పంతం నానాజీ పార్టీ కేడర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నానాజీ దంపతులు కార్యాలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాశీస్సులతో అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమన్నారు. సీఎం జగన్ ప్రభుత్వ చేతగాని పాలనతో రాష్ట్రంలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, అన్నివర్గాల ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు చిక్కాల రామచంద్రరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పేరాబత్తుల రాజశేఖర్, పార్టీ రాష్ట్ర వైద్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు, బోళ్ల కృష్ణమోహన్, తాతాపూడి రామకృష్ణ, చొక్కా జగన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడా కృష్ణమోహన్, రంబాల వెంకటేశ్వరరావు, కాళ్ల ధనరాజు, భీమశేఖర్, యార్లగడ్డరామ్‌కుమార్ పాల్గొన్నారు.

'నాలుగేళ్లలో ఉపాధి కల్పించలేదు'

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22: గడిచిన నాలుగేళ్లలో కాకినాడలో ఉపాధి కల్పించలేకపోయిన ఎమ్మెల్యే, వైసీపీ ప్రభుత్వం సిగ్గు పడాలని జనసేన సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. పార్టీ నాయకులు పినపోతు సత్తిబాబు, బలసాడి శ్రీను ఆధ్వర్యంలో 37వ డివిజన్ ప్రగోడా స్కూల్ ప్రాంతంలో ప్రతి చేతికి ఉపాధి కోసం జనసేన మేము సిద్ధం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి శశిధర్ మాట్లాడుతూ ఉపాధి లేక కాకినాడలో ప్రజలు, నిరుద్యోగులు సతమతమవుతున్నారన్నారు. సాదనాల రమేష్, బొద్దు రాజు, మాతా చిన్న, నందా, సహారా రాజేష్ పాల్గొన్నారు.

'స్వాతంత్ర్యోద్యమంలో కాకినాడ పాత్ర ఘనమైనది'



కాంగ్రెస్ మహాసభల పుస్తకాన్ని చూస్తున్న నొరియా

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, భారతీయ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధకుడు, పూర్వపు కేంద్ర డిఫెన్స్ మంత్రి మహవీర్ త్యాగి మనవడు ఏఎన్ఐఎల్ నొరియా గురువారం కాకినాడ వచ్చారు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో కాకినాడ పోషించిన పాత్ర చాలా ఘనమైనదన్నారు. 1923 కాంగ్రెస్ మహాసభలు భారత స్వాతంత్ర్యోద్యమానికి గొప్ప దిశానిర్దేశమన్నారు. 1921లో గాంధీజీ కాకినాడ వచ్చినప్పుడు అ ద్భుతమైన ప్రజాస్పందన వచ్చిందన్నారు. అనంతరం నొరియాకు కాంగ్రెస్‌మహాసభలపై తాను సంకలనం చేసిన పుస్తకాన్ని గుడవర్తి సత్యమూర్తి బహూకరించారు. రామారావు, వాసాసత్యనారాయణమూర్తి, అల్లూరు సురేంద్ర, పావని, శర్మ, వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ తీరుపై ఎంపీపీ గొల్లపల్లి ఆక్షేపణ

ఏలేశ్వరం, ఫిబ్రవరి 22: వైసీపీ పార్టీకి, పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్ పదవికి 3నెలల క్రితం రాజీనామా చేసి తాను టీడీపీలోకి చేరిన తాజాగా వైసీపీ అధిష్టానం తనకు జోనల్ ఇన్‌చార్జ్‌గా మళ్లీ నియమించడం పట్ల ఏలేశ్వరం మండలాధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి వైసీపీ తీరుపై ఆక్షేపణ వ్యక్తం చేశారు.

యువతకు ఉద్యోగావకాశాలు రావాలంటే..

చంద్రబాబు ప్రభుత్వం రావాలి

'వై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు



'వై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే చంద్రబాబు ప్రభుత్వం రావాలని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ కాకినాడ జిల్లా కార్యాలయంలో 'వై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మోసపూరిత మాటలతో యువతను దగా చేసి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఐదేళ్లలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా, పరిశ్రమలు తీసుకురాకుండా జే-టాక్స్ బాదుడుతో ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా చేశాడన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు మెరుగ్గా ఉద్యోగావకాశాలు లభించనున్నాయన్నారు. అందువల్ల కొత్తగా ఓటువచ్చిన యువతీ యువకులు ప్రతిఒక్కరూ మై ఫస్ట్ ఓట్ ఫర్ చంద్రబాబు నినాదంతో సంసిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, పార్టీ ప్రొఫెషనల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు వనమాడి మోహనవర్మ, నాయకులు పలివెల రవికుమార్, తుమ్మల రమేష్, గదుల సాయిబాబు, గాది శివరామకృష్ణ, ఎస్‌కే రహీమ్, గుజ్జు లక్ష్మణరావు, చింతలపూడి రవి, గెద్దం పూర్ణ, నిద్రబంగి సత్తిబాబు, పాలిక సూర్య, మీసాల సునీత, పీర్ల లక్ష్మీప్రసన్న, సత్యవేణి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు

నాగ సోమరాజు, దంతుటూరి శ్రీనివాసరాజు, చిటికెల శ్రీనివాసరావు, పెంటపాటి రఘు, ధారకొండ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి: యనమల కృష్ణుడు

తొండంగి: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం పెరుమాళ్ళపురం పంచాయతీ పరిధిలోని బూత్ కన్వీనర్లు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల తొలగింపు, చేర్పులు, బదిలీ తదితర అంశా లపై ప్రతి కార్యకర్త అవగాహన కలిగి ఉండాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, చొక్కా కాశీశ్వరావు, మహంకాళి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పేకేటి హరికృష్ణ పాల్గొన్నారు.

సుపరిపాలన టీడీపీ, జనసేనతోనే సాధ్యం

తుని రూరల్: సుపరిపాలన టీడీపీ, జనసేనతోనే సాధ్యమని తుని టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్యస్పష్టం చేశారు. తుని మండలం కొలిమేరు గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటిస్తూ ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలోయనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి

సైకో ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం : మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం: సైకో జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పి.రాయవరం గ్రామానికి చెందిన విద్యాకమిటీ చైర్మన్ వీసం ఏసుబాబు, అతని మిత్ర బృందం సభ్యులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికి టీడీపీ కండువాలు కప్పి వర్మ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కార్యక్రమాలు, స్థానిక నాయకత్వం, సూపర్‌సిక్స్ పథకాలు నచ్చి టీడీపీలో చేరారని చెప్పారు. బెజవాడ సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, ఎస్వీ రవివర్మ, కర్నీడి వీసం స్వామి, కర్నీడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'రామచంద్రపురం టికెట్ రెడ్డి సుబ్రహ్మణ్యంకే ఇవ్వాలి'

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ టిక్కెట్‌ను ప్రస్తుత ఇన్‌చార్జ్‌గా ఉన్న రెడ్డి సుబ్రహ్మణ్యానికే కేటాయించాలని కాజులూరు మండల టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. కాజులూరు మండలం ఆర్యవటంలో గురువారం ఈమేరకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పేపకాయల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి రాయుడు లీలాశంకర్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతుల మాధవ, మండల ఎస్సీసెల్ నాయకుడు పలివెల ఇజ్రాయిల్‌రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు వనుం వీరబ్రహ్మం, మహిళా నాయకురాలు ఎం. సత్యవతి, నియోకవర్గ బీసీ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, పెంకే అప్పారావు, రెడ్డి శేషారావు, కె. దొరబాబు, వడ్లపాటి శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా పట్టా నాకు ఇప్పించండి

● 6వ నెంబరు పట్టాను ఆన్‌లైన్‌లో 77గా మార్చారు

గండేపల్లి, ఫిబ్రవరి 22: జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీలో భాగంగా నాకు 6వ నెంబరు పట్టా వచ్చింది. ఆ స్థలం రోడ్డు వారన అనుకూలంగా ఉండటంతో ఆ పట్టా మార్చి ఆన్‌లైన్‌లో 77వ నెంబరుగా మార్చి పట్టా తీసుకోమంటున్నారని సూరంపాలెం గ్రామానికి చెందిన పలివెల వీరలక్ష్మి గురువారం సూరంపాలెం పంచాయతీవద్ద ఆందోళనకు దిగింది. సూరంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న నిరుపేదల ఇళ్ల స్థలాల్లో భాగంగా సుమారు 198 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. పట్టాల్లో వీరలక్ష్మికి 6వ నెంబరు వచ్చింది. 6వ నెంబరులో ఇల్లు కట్టుకునేందుకు శంకుస్థాపన చేసుకుని సిద్ధమైంది. ఆ సమయంలో వీరలక్ష్మి చిన్నకొడుకు రాజుకు పెద్దాపురంలో రోడ్డు ప్రమాదం జరిగిందని దీంతో 8 నెలల పాటు ఆసుపత్రిలో ఉన్నామని, ఆ సమయంలో ఇక్కడ నాకు ఇచ్చిన 6వ నెంబరు పట్టా ఇళ్లస్థలాన్ని గ్రామానికి చెందిన మరో వ్యక్తికి అధికారులు, నాయకులు సర్వే నెంబరు మార్చి నా స్థలాన్ని ఇచ్చి ఆ వ్యక్తికి ఉన్న 77వ నెంబరు స్థలాన్ని నాకు ఇచ్చి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాకు ఇచ్చిన 6వ నెంబరు స్థలంలో రెండు అంతస్తుల బిల్డింగ్ కూడా నిర్మించారని నా స్థలం నాకు ఇప్పించాలంటున్నారు. నేను ఇళ్ళ నిర్మించుకునేందుకు వేసుకున్నఐరన్, ఇసుక దొంగిలించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై నాకు న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. అలాగే వీరలక్ష్మి స్థలమే కాకుండా కలెక్టరేట్ నుంచి వచ్చిన పట్టా నెంబర్‌లో వైట్‌నర్‌తో సర్వే నెంబర్లు కనిపించకుండా చేసి సుమారు 30 మందికి పట్టాలు తారుమారు చేశారని తెలుస్తోంది. దీనిపై వీఆర్వో సుబ్బారావును కోరగా తమకు ఈ విషయాలే ఏమీ తెలియవని, నేను కొత్తగా వచ్చానన్నారు. కానీ కలెక్టరేట్ నుంచి 6వ నెంబరు స్థలం వచ్చిందని 77కు ఎల మారిందో తెలియదని ఆయన వివరణ ఇచ్చారు.



కలెక్టరేట్ నుంచి వచ్చిన ఇళ్ల పట్టాను చూపిస్తున్న బాధితురాలు పలివెల వీరలక్ష్మి

95.03 శాతంతో ఈకేవైసీ నమోదులు

సామర్లకోట, ఫిబ్రవరి 22: జిల్లాలో 21 మండలాల్లో పంట పొలాలకు ఈకేవైసీ నమోదుచేయాలన్న లక్ష్యంలో భాగంగా నమోదులకు గడువు శుక్రవారం సాయంత్రంతో ముగియనుండగా గురువారంరాత్రి నాటికి జిల్లావ్యాప్తంగా 95.03శాతం నమోదులు పూర్తిచేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఇన్‌చార్జి డీవీఎస్.హరి తెలిపారు. గురువారంరాత్రి ఈమేరకు ఆయా మండల వ్యవసాయాధికారులతో సమీక్షించిన అనంతరం సామ ర్లకోటలో విలేకరులతో డీఏవో శ్రీహరి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 21మండలాల్లోనూ 2,40,933 నమోదు చేయగా 97,563 మంది రైతులకు చెంది 1,71,929.2 ఎకరాలు ఉండగా 95.03 శాతం నమోదు పూర్తయినట్లు తెలిపారు. 1,09,741 మంది రైతులకు చెంది 1,81,408.7ఎకరాల మేర ఈకేవైసీ నమోదులు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని ముందుగానే చేరుకున్నట్లు డీఏవో శ్రీహరి తెలిపారు.

జర్నలిస్టులపై దాడులకు నిరసనగా లిబరేషన్ ఆందోళన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి22: రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్నదాడులను నిరసిస్తూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు గురువారం మండలంలోని పోతులూరులో ఆందోళన నిర్వహించారు. అనంతపురంలో ఫోటో జర్నలిస్టు, కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడిచేయడం పట్ల ఆందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామంలో లిబరేషన్ జెండాలతో వారు ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రజ్యోతి విలేఖరిపై, ఈనాడు కార్యాలయంపై దాడులు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆందోళనలో లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు, రాష్ట్ర జిల్లా నాయకులు మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం, కాకర రత్నకుమారి, చిన్నం అచ్చిరాజు, కుంచే రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు స్థానికేతరులకు ఇస్తే సహించేది లేదు

తాళ్లరేవు, ఫిబ్రవరి 22: చొల్లంగిలో ఇళ్ల స్థలాలు స్థానికేతరులకు ఇస్తే సహించేది లేదని తాళ్లరేవు మండల టీడీపీ అధ్యక్షుడు దున్నా సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసం నుంచి నిరసనకారులకు 23వ రోజు పూర్తి మద్దతును తెలియజేశారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 22: ఏలేశ్వరం పట్టణంలోని ఐపీ ఎఫ్ కాలనీకి చెందిన ఓ బాలిక ఫర్నీచర్ శుభ్రం చేసే ద్రావణాన్ని సేవించి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సమాచారం. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన మరణానికి ప్రేమించిన వ్యక్తి బంధువులే కారణమంటూ ఆమె రాసినట్టుగా చెబుతున్న లేఖ ఒకటి ఇంట్లో లభ్యమైనట్టు సమాచారం. దీనికి సంబంధించి పోలీసులకు ఏసమాచారం అందలేదని తెలిసింది.

పాదగయలో మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

పిఠాపురం, ఫిబ్రవరి 22: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలు మార్చి 6వ తేదీన ప్రారంభం కానున్నాయి. 6న అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి కల్యాణం, 7న గ్రామోత్సవాలు, 8న మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారి నిజరూపదర్శనం, రాత్రి లింగోద్భవ కాలాభిషేకం, 9న రాత్రి నాకబలి దండాడింపు, దొంగలతోపు ఉత్సవం, రాత్రి స్వామివారి రథోత్సవం, 10న త్రిశూల స్నానం, 11న రాత్రి పాదగయ పుష్కరిణిలో తెప్పోత్సవం, శ్రీపుష్పోత్సవం జరుగుతాయి. ఈ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికలు, గోడపత్రికలను గురువారం పిఠాపురంలో తన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనరు, పాదగయ ఈవో పులి నారాయణమూర్తి, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల మెరుపు దాడి

● 40లీటర్ల సాటు సారా స్వాధీనం

కొత్తపల్లి, ఫిబ్రవరి 22: జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ డీఎస్పీ కోపల్లె హనుమంతరావు పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ కెప్రమోద్ ఆధ్వర్యంలో కొత్తపల్లి పోలీసులు రమణక్కపేట శివారు రామరాఘవపురంలో గురువారం నాటుసారా బట్టీలపై మెరుపు దాడి చేశారు. ఈదాడిలో 300 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లంఊటను ధ్వంసం చేశారు. సారాతయారీకి ఉపయోగించే ప్లాస్టిక్‌డ్రమ్ములు, గ్యాస్ సిలెండర్లతోపాటు 40లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పీవీ స్వామినాయుడు చెప్పారు. సారాతయారు చేసే కొత్తమూలపేటకు చెందిన ముత్తు తాతారావుపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని తిమ్మాపురానికి చెందిన కంకిపాటి శివ(34) ఇటీవల పురుగుల మందు తాగి అస్వస్థతకు గురికావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి శివ గురువారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై తునిరూరల్ ఎస్ఐ డి.రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

తునిరూరల్, ఫిబ్రవరి 22 : 20 మద్యం బాటిల్స్‌తో తునికి చెందిన కంకిపాటి శ్రీను తుని పట్టణ పోలీసులకు పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు హెడ్ కానిస్టేబుల్ చిన్నారావు కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

గండేపల్లి, ఫిబ్రవరి 22: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూ మం త్రంగా జరిగింది. ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. సమావేశంలో చెప్పడమే తప్ప ఆచరణలేదని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. అధికారులు, నాయకులు హాజరుకాకపోవడంతో సమావేశం వెలవెలబోయింది. కొద్దిసేపటికే సమావేశం తూతూమంత్రంగా ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, మందిపట్ల రామకృష్ణ, మధుకుమార్, ఎంపీడీవో హనుమంతురావు, తహసీల్దార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఆశ్రమానికి మంచాలు

తాళ్లరేవు, ఫిబ్రవరి 22: వినోదయ హాస్పటల్ వార్షికోత్సవం సందర్భంగా చొల్లంగి, గురజనాపల్లి నిరీక్షణా విభిన్న ప్రతిభావంతు ఆశ్రమానికి మొండి రవి సహకారంతో మంచాలు, పరుపులను గురువారం బహూకరించారు. ఆశ్రమం అద్దె నిమిత్తం రూ.5వేలు నగదును ఉచితంగా ఆశ్రమం వ్యవస్థాపకుడు బొద్దు సత్యానందంకు అందించారు. కార్యక్రమంలో వినోదయ హాస్పటల్ చైర్మన్ లావణ్య, డాక్టర్ రామ్మోహన్, రోటరీక్లబ్ ప్రముఖులు, లవింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

భూసార పరిరక్షణపై అవగాహన అవసరం: ఆత్మ పీడీ జ్యోతిర్మయి

సామర్లకోట, ఫిబ్రవరి 22: ప్రకృతి ప్రసాదించిన భూమిలో పోషకవిలువలను ఏమాత్రం తగ్గకుండా కాపాడేందుకు తీసుకో వాల్సిన చర్యలపై నేటితరానికి అవగాహన అవసరమని జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.జ్యోతిర్మయి వెల్లడించారు. సామర్లకోటలో గురువారం విలేకరులతో పీడీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహనా సదస్సులు వివరించడమేగాక భూసార పరీక్షలు ఏమిటి, పరీక్షలు ఎలా నిర్వహించాలి, రైతులు ఏమిచేయాలి, భూసార పరీక్షల వలన రైతుకు ఉపయోగం, ఎరువులు వినియోగం తదితర అంశాలను విద్యార్థులకు వివరించడం ద్వారా రానున్న కాలంలో భూసార విలువలను పెంచేందుకు కొంతమేరకైనా దోహదపడగలరని విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని పీడీ జ్యోతిర్మయి చెప్పారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

పెద్దాపురం, ఫిబ్రవరి 22 : మామిడిలో రైతులు సస్యరక్షణ చర్యలను పాటించాలని ఉద్యానశాఖాధికారిణి నూనే సుజాత పేర్కొన్నారు. స్థానిక విలేఖరులతో ఆమె గురువారం మాట్లాడా రు. ప్రస్తుతం నేలలో తేమశాతం అధికంగా ఉండడం కారణంగా పూత ఆలస్యం కావచ్చన్నారు. నేలలో తేమశాతాన్ని తగ్గించేందుకు తేలికగా దున్నుకోవాలన్నారు. యూరియా వేయడం కార ణంగా తేమశాతాన్ని తగ్గించుకోవచ్చని సూచన చేశారు. మామిడిలో ఆశించే తామర, ఆకుగూడు, తేనేమంచు, కాండం తొలిచే పురుగు, పండు ఈగ, పక్షి కన్నుతెగులువాటిని నివారించుకునేందుకు ఉద్యానశాఖాధికారుల సూచనలు పాటించాలన్నారు.

విశ్వకర్మ పథకం దరఖాస్తుల కోసం వైసీపీ సర్పంచ్ వసూళ్లు

● తాళ్లరేవు ఎంపీడీవోకు ఫిర్యాదు

తాళ్లరేవు, ఫిబ్రవరి 22: కేంద్రప్రభుత్వం చేతివృత్తుల వారికోసం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తులు చేసేందుకు తాళ్లరేవు వైసీపీ సర్పంచ్, సిబ్బంది లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు బీజేపీ నాయకుడు విత్తనాల కరిమికస్వామి ఎంపీడీవోకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తీసుకువచ్చిన విశ్వకర్మ యోజన పథకం పూర్తిగా ఉచితం కేవలం దరఖాస్తు చేసుకున్న సమయంలో రూ.100లు సీఎస్‌సీ సెంటర్‌లో చెల్లిస్తే సరిపోతుందన్నారు. అదే దరఖాస్తు గ్రామపంచాయతీ, సచివాలయంలో పూర్తిగా ఉచితం అన్నారు. వైకాపా సర్పంచ్ లబ్ధిదారుల నుంచి రూ.500లు వసూళ్లు చేస్తున్నారని ఇది చాలా దారుణం అన్నారు. ఉన్నతాధికారులు స్పందిచి వసూళ్లు చేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

పిఠాపురం, ఫిబ్రవరి 22: కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారిపై పిఠాపురం బైపాస్‌రోడ్డులో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని బీమ్‌నగర్, రాపర్తి సెంటర్ తదితర ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసేందుకుగానూ స్టాపర్‌బోర్డులు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వాటికి రేడియం స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పోలీసులు గురువారం చేపట్టారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 22: గొల్లప్రోలు మండలం శివాలయంలో నూతనంగా నిర్మించిన హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు గురువారం వైభవంగా జరిగాయి. మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, ప్రధాన హోమాలు, మూర్తి, మూలమంత్ర హోమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, యంత్రన్యాసం జరిగాయి. అనంతరం బారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తునిరూరల్, ఫిబ్రవరి 22: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బొప్పన రాము అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జడ్పీటీసీ పోతల సూర్యామణి, చోడరాజు రాంబాబు రాజు, అత్తి నాగరాజు,రాష్ట్ర పెరికి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తమ గంగాభవాని తదితరులు ఉన్నారు.

ఘనంగా రామాలయం ద్వితీయ వార్షికోత్సవం

పెద్దాపురం, ఫిబ్రవరి 22: స్థానిక కొత్తపేట రామాలయం ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహి ంచారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్క రించుకు ని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను వితరణ చేశారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: సుందరం మాస్టార్, భ్రమయుగం, ముఖ్యగమనిక, మస్తీసేడ్స్ ఉన్నాయి రా, అంబాజీ పేటమ్యారేజీ బ్యాండ్, రాజధానిఫైల్స్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: సుందరం మాస్టార్, మస్తీసేడ్స్ ఉన్నాయిరా, భ్రమయుగం, రాజధా నిఫైల్స్, క్రేల్, ఊరుపేరు భైరవకోన

తిరుమల: అంబాజీ మ్యారేజ్‌బ్యాండు, సూర్య సన్ ఆఫ్ కృష్ణ (ఉదయం) ఓయ్

లక్ష్మి	:	ఒక్కడు
సీ అండ్‌సీ1	:	సిద్ధార్థ్‌రాయ్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	ఊరు పేరు భైరవకోన
పద్మప్రియ	:	సుందరం మాస్టార్
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	సిద్ధార్థ్‌రాయ్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

కాకినాడ నుంచి అరుణాచలం బస్సు యాత్ర



బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్టీవో శ్రీనివాసరావు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22:కాకినాడనుంచి అరుణాచలం బస్సుయాత్రకోసం రెండు సూపర్‌లగ్జరీ స్పెషల్ బస్సులు గురువారం బయలుదేరాయి. ఈ బస్సులను కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఇవి మూడురోజుల యాత్రలో ఐదు క్షేత్రాలు చూపించి తిరిగి 25న కాకినాడ చేరుకుంటాయన్నారు. ఈయాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి చూపిస్తారు. ఈ యాత్రకు ఒక్కొక్కరికి రూ.3100 చొప్పున టికెట్ వసూలు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ పాల్గొన్నారు.

25న ఈఎస్ఐ ఆస్పత్రి ప్రారంభం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22: ఈనెల 25న కాకినాడలో రూ.114కోట్లతో నిర్మించిన ఈఎస్ఐ ఆస్పత్రిని ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని గురువారం ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో కాకినాడ ఎంపీ వంగా గీత వెల్లడించారు. కార్యక్రమంలో కాకినాడ అదనపు కమిషనర్ సీహెచ్‌నాగనరసిం హారావు, ఎంహెచ్‌వోపృథ్వీచరణ్, ఇన్‌చార్జి సూపరిం టెండెంట్ కె.శ్రీనివాసరావు, ఎస్ఈ పి.సత్యకుమారి పాల్గొన్నారు.

పాఠశాల వసతుల పరిశీలన

తొండంగి, ఫిబ్రవరి 22 : ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వై.నాగార్జున గురువారం బెండపూడి ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఫేజ్ 1లో పాఠశాలకు సమకూరిన వసతులపై ఆరా తీశారు. వాటి వినియోగాన్ని పరిశీలించారు, మరుగుదొడ్లు, ఫర్నీచర్, డిజిటల్ పరికరాలు, తాగునీటి వనరుల పనితీరును, వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. విడుదలైన నిధులు వినియోగించిన మొత్తం, కావాల్సిన అవసరాలపై ప్రధానోపాధ్యాయులు నాగం కృష్ణమూర్తి, ఎంఈవో2 ఆనిశెట్టి వెంకటసుబ్బిరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గతంలో ఉన్న పరిస్థితికి, ఇప్పటి పరిస్థితికి ఉన్న వ్యత్యాసంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈ, ఏఈ ఉన్నారు.

నేడు వికాసలో ఇంటర్వ్యూలు..

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 22: కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈనెల 23న హెచ్‌డీఎఫ్‌సీ (హెచ్‌డీబీ) కంపెనీలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ మేనేజర్ తదితర పలుఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.13వేల జీతం, ఇన్సెంటివ్స్, ఇన్సూరెన్స్, మెడికల్ బోనస్ కల్పిస్తారన్నారు. అభ్యర్థులు శుక్రవారం ఉదయం 9గంటలకు వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 7799376333లో సంప్రదించాలని పీడీ తెలిపారు.

కులమతాలకు అతీతంగా కుంభాభిషేకం



బియ్యం, వంట సామగ్రి నెహ్రూకు అందజేస్తున్న పాస్టర్ కన్నబాబు

జగ్గంపేటరూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తలపెట్టిన మహాకుంభాభిషేకానికి కులమతాలకు అతీతంగా మద్దతు లభిస్తోంది. క్రైస్తవులు, ముస్లింలు స్వయంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టినప్పుడు చాలామంది నిరుత్సాహపరిచారని కానీ కన్నబాబు మాత్రం చాలా గొప్ప కార్యక్రమమని ప్రోత్సమించారన్నారు. ఇర్రిపాకలో ప్రతిరోజు వేలాది మందికి అన్న సమారాధాన కార్యక్రమం జరుగుతున్నదని, అటువంటి అన్నసమారాధన కార్యక్రమంలో కృష్ణునిపాలెం గ్రామ టీడీపీ నాయకులు భాగస్వాములై 6క్వింటాలు బియ్యం, 100కేజీల కందిపప్పు, నూనెలు నాలుగు డబ్బాలు, ఐదు బస్తాల ఉల్లిపాయలు, ఇర్రిపాకకు పంపించినట్లు నెహ్రూ తెలిపారు. పాస్టర్ కన్నబాబు మాట్లాడుతూ నెహ్రూ తలపెట్టిన మహాకుంభాభిషేకం ఎంతో ప్రత్యేకమైనదన్నారు. ఇటువంటి మహా కార్యక్రమానికి తమవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో అన్నదాన కార్యక్రమానికి సరుకులు అందించామన్నారు. కార్యక్రమంలో మండిగ గంగాధర్, ఉపసర్పంచ్ కిషోర్. సీవీఎం రాజుపాస్టర్, బోలగుండ రాజారెడ్డి, మండిగ బాలాజీ, సిద్ధ సురేష్, కొంగరపు రాజు, జల్లేపల్లి వాసు, మేడిరాజు, షేక్ సుభాని, బంటుమిల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మురారిలో మహారుద్రాభిషేకానికి
ఆహ్వానపత్రిక పంపిణీ

గండేపల్లి, ఫిబ్రవరి 22: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కుటుంబం 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న మహారుద్రాభిషేకానికి ప్రతిఒక్కరూ హాజరై స్వామివారిని దర్శించుకోవాలని, మండలంలో మురారి గ్రామ పార్టీ అధ్యక్షుడు సుంకవిల్లి రాజు, యువ నాయకుడు జాస్తి వసంత్ ఇంటింటికీ ఆహ్వాన పత్రికలు అందజేశారు.